నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

3 | నిజామాబాద్ శనివారం 8 మార్చి 2025 | ADILABAD NIRMAL


# ఆదిలాబాద్ ఎస్పీగా అఖిల్ మహాజన్

## గౌష్ ఆలం కరీంనగర్‌కు సీపీగా..



ఆదిలాబాద్ నూతన ఎస్పీగా నియమితులైన అఖిల్ మహాజన్



కరీంనగర్ సీపీగా బదిలీ అయిన గౌష్ ఆలం

ఆదిలాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలంను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్ కమిషనర్ ఆఫ్ పోలీస్(సీపీ)గా ఆయన బదిలీ అయ్యారు. జిల్లాకు కొత్త ఎస్పీగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను ప్రభుత్వం నియమించింది. 14 నెలల పాటు ఎస్పీగా సేవలు అందించిన గౌష్ ఆలం శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేశారు. గంజాయి, గుట్కా, నకిలీ పత్తి విత్తనాలు, రేషన్ బియ్యం అక్రమ రవాణా, మట్కాపై ఉక్కుపాదం మోపారు. ఇటీవల ఇసుక అక్రమ నివారణలో సైతం పకడ్బందీ చర్యలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల నిర్వహణతో పాటు ఇతర కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టారు.



నీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు

# సొనాలలో నీటి ఎద్దడి

బోథ్, మార్చి 7 : సొనాల మండల కేంద్రంలోని ఎస్సీ, కాలనీలో 1, 2, 3 వార్డుల్లో తీవ్ర నీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని రోజులుగా ఇబ్బంది పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అన్నారు. బోరుబావుల్లో నీరు అడుగంటిపోయిన దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నీటి ఎద్దడి నివారించాలని అధికారులను బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ భీంరావు పాటిల్ కోరారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం సైతం పంపిణీ చేయకపోవడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతు సంఘం నాయకులు

# కనీస మద్దతు ధరల చట్టం తేవాలి

## నిర్మల్ కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం నాయకుల నిరసన

నిర్మల్ అర్బన్, మార్చి 7 : పంటలకు కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని సంయుక్త కిసాన్ మోర్చా అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నందిరామయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగం నడ్డి విరుస్తూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్రలు పన్నుతున్నదని ఆరోపించారు. 13 నెలల పాటు ఢిల్లీ రహదారులపై రైతులు ధర్నాలు చేసి సాధించిన మూడు రైతు చట్టాలను రద్దు చేసేందుకు దొంగదారిలో జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ ముసాయిదా పేరుతో తీసుకురావడం చూస్తుంటే మోడీ ప్రభుత్వం ఎవరికోసం పని చేస్తుందో అర్థమవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు నష్టం కలిగిస్తే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాజన్న, తిరుపతి, నర్సయ్య, విలాస్, గంగారాం, గోరెభాయ్, సుందర్, దేవ్‌రావు, మోహన్, రాకేశ్ ఉన్నారు.



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లోని శివాజీ చౌక్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు చేపట్టిన ర్యాలీని జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. 'బేటీ పడావో బేటీ బచావో', మహిళా సాధికారతపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సాధికారతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. 'బేటీ బచావో బేటీ పడావో' కార్యక్రమం ప్రారంభించి పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా 45 రోజుల పాటు జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం నుంచి జిల్లాల్లో మహిళలకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా సీనియర్ జడ్జి(లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్) జీ రాధిక, ఆర్డీవో రత్నకల్యాణి, డీఆర్డీవో విజయలక్ష్మి, సీడీపీవో నాగమణి, ఎసీడీపీవో నాగలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌గోపాల్, మెప్మా పీడీ సుభాష్, డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డి, మిషన్ శక్తి కో ఆర్డినేటర్ సవిత, ఎస్‌హెచ్‌జీ మహిళలు, ఏఎన్ఎంలు, విద్యార్థులు తదితరులు ఉన్నారు. ఈ ర్యాలీలో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురై కిందపడడంతో వైద్య సిబ్బంది అక్కడికి చేరుకొని ప్రాథమిక చికిత్స అందించారు.



రాఘాపూర్ చెరువులో అడుగంటిన నీరు

కాంగ్రెస్ తెచ్చిన కరువు

# చెరువు నిండక.. పంటలు పండక

## నాడు వెయ్యి ఎకరాలకు సాగు నీరందించిన రాఘాపూర్ చెరువు

- నేడు 300 ఎకరాలకూ ఇవ్వలేని దుస్థితి
- గణనీయంగా తగ్గిన యాసంగి సాగు
- ఎండుతున్న పంటలను పశువులకు వదిలేస్తున్న రైతులు

కుమ్రం భీం ఆసిఫాబాద్ (నమస్తే తెలంగాణ)/ సిర్పూర్(యు), మార్చి 7 : నాడు వెయ్యి ఎకరాలకు సాగు నీరందించిన రాఘాపూర్ చెరువు.. నేడు కనీసం మూడు వందల ఎకరాలకూ భరోసా ఇవ్వలేని దుస్థితికి చేరుకున్నది. గతేడాది వర్షాలు సరిగా పడక చెరువు నిండక.. దీని కింద వేసిన పంటలు ఎండిపోతుండగా, వాటిని పశువుల మేతకు వదిలేయాల్సిన పరిస్థితి దాపురించింది.

**మరమ్మతులు లేక.. నీరందక..**

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యు) మండలంలోని రాఘాపూర్ చెరువు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద యేటా యాసంగిలో వెయ్యి ఎకరాల్లో పంటలు పండించేవారు. (వానకాలంలో ఈ చెరువు నీటిని వాడుకోరు. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి పంటలు తీస్తారు) కానీ, ఈ ఏడాది సుమారు మూడు వందల ఎకరాలే సాగు చేస్తున్నారు. ఆ పంటలు కూడా పూర్తిగా ఆరుతడి పంటలే కావడం గమనార్హం. వర్షాలు సరిగా పడకపోవడంతో చెరువు పూర్తిస్థాయిలో నిండలేదు. దీంతో చెరువు కింద పంటలు వేయడం చాలా వరకు తగ్గించారు. చెరువు కాలువలకు ఆనుకొని ఉన్న కొంత మంది రైతులు మాత్రమే మూడు వందల ఎకరాల వరకు ఆరుతడి పంటలు వేశారు. కనీసం కాలువలకు మరమ్మతులు చేసి నీరందించాల్సి ఉండగా, పట్టించుకునే నాథుడు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. ఇక చేసేదేమీ లేక రైతులు వాటిని పశువులకు వదిలేస్తున్నారు.



వదిలేసిన పంటలను మేస్తున్న పశువులు



### రెండెకరాలు ఎండిపోయినయి

రాఘాపూర్ చెరువు కింద నాకు ఐదెకరాలు ఉంది. వానకాలంలో వర్షాధార పంటలే వేస్తా. యాసంగిలో మాత్రం రాఘాపూర్ చెరువు మీద ఆధారపడి సాగు చేస్తా. ఎప్పటిలాగే ఈ యాసంగిలో కూడా ఐదెకరాల్లో జొన్న వేసిన. చెరువు నీళ్లందక రెండెకరాలు ఎండిపోయినయి. గా పంటను పశువుల మేతకు వదిలేసిన.

-కనక గోవింద్‌రావు, రైతు

### యాసంగిలో సాగు చేయలే



నాకు రాఘాపూర్ చెరువు కింద ఆరెకరాల భూమి ఉంది. యేటా యాసంగిలో చెరువుపై ఆధారపడి సాగు చేసేటోన్ని. ఈ ఏడాది చెరువులో నీళ్లు లేక మొత్తానికే పంటలేయలేదు. ఈ చెరువు కింద సాగు చేసిన రైతుల్లో కొందరు పంటలను పశువులకు వదిలేస్తున్నారు.

-ఆడ లింగారావు, రైతు



నిర్మల్‌లో పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

# రాణాలు వదిలి.. ప్రజలతో మమేకం

## మెన్ పీసీలతో సమానంగా మహిళా పోలీసులకు పెట్రోకార్ విధులు

- విద్యార్థినుల రక్షణకు 'పోలీస్ అక్క'
- మహిళా దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లాలో వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం
- జిల్లా ఎస్పీని అభినందించిన రాష్ట్ర డీజీపీ జితేందర్

నిర్మల్ అర్బన్, మార్చి 7 : నిర్మల్ ఎస్పీగా జానకీ షర్మిల బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోనే జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షిస్తూ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. సమస్యాత్మక ప్రాంతంగా పేరున్న జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు, నిర్మల్, భైంసాలో వినాయక, దుర్గామాత ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించి అందరి మన్నలను పొందారు. బాసర ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకుని విద్యార్థుల్లో ఆత్మహత్యల నివారణ కోసం కెరీర్ గైడెన్స్, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపారు. వీటితో పాటు మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నారీశక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులకు పెట్రోకార్ విధులను అప్పగించడం, మహిళలు, విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా 'పోలీస్ అక్క'పేరుతో వినూత్న కార్యక్రమాలు చేపట్టి ప్రజలతో పాటు, ఉన్నతాధికారులు మన్ననలు అందుకున్నారు.

### నిర్మల్ జిల్లాలో వినూత్న కార్యక్రమానికి ఎస్పీ శ్రీకారం

నిర్మల్ జిల్లాలోని 5 సర్కిళ్ల పరిధిలోని 20 పోలీస్ స్టేషన్లలోని మహిళా కానిస్టేబుళ్లు రిసెప్షన్ విధులకే పరిమితమయ్యారు. అప్పుడప్పుడు ధర్నాలు, రాస్తారోకోలు, ముఖ్య నేతల పర్యటనల విధులకు మాత్రం స్టేషన్‌ను వదిలి బయటకు వచ్చేవారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ జానకీ షర్మిల స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసులకు నారీశక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా పెట్రోకార్ విధులను అప్పగించారు. వారంలో ఒక రోజు పురుష కానిస్టేబుళ్లతో సమానంగా డయల్ 100 కాల్ అటెంప్ట్, వాహనాల తనిఖీలు, పాయింట్ బుక్ చెకింగ్, ఎంవో అఫెండర్స్‌తో పాటు ఇతర విధులను నిర్వహించనున్నారు.



కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్పీ జానకీ షర్మిల

### కేజీబీవీ విద్యార్థులకు అండగా 'పోలీస్ అక్క'

నిర్మల్ జిల్లాలో మహిళలు, విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా ముందుకు సాగేందుకు జిల్లా ఎస్పీ జానకీ షర్మిల 'పోలీస్ అక్క' పేరుతో జిల్లాలోని 18 కేజీబీవీ పాఠశాలలను మహిళా పోలీసులు దత్తత తీసుకున్నారు. నెలకోసారి ప్రభుత్వ బాలికల విద్యాసంస్థలను సందర్శించి హాస్టల్‌లో అక్కడే బస చేసి విద్యార్థులకు 'గుడ్ టచ్..బ్యాడ్ టచ్, సైబర్ క్రైమ్, పాఠశాలలో సమస్యలు, విద్యార్థినులపై వేధింపులు నివారణపై అవగాహన కల్పిస్తున్నారు. సమస్యలను తెలుసుకొని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తూ విద్యార్థినులకు అండగా నిలుస్తున్నారు.

### జిల్లా ఎస్పీని అభినందించిన డీజీపీ జితేందర్

మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో పోలీసు శాఖకు వన్నె తీసుకువచ్చేలా మహిళా పోలీసులకు పెట్రోకార్ విధులు కేటాయించడం, 'పోలీస్ అక్క',' నారీశక్తి'కార్యక్రమాలను ప్రారంభించిన ఎస్పీ జానకీ షర్మిలను రాష్ట్ర డీజీపీ జితేందర్ 'ఎక్స్' వేదికగా అభినందించారు. జిల్లా ప్రజలు సైతం ఎస్పీకి అభినందనలు తెలుపుతున్నారు.

### తొలిరోజు అద్భుతంగా విధులు నిర్వహించారు



మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్మల్ జిల్లాలో నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా కానిస్టేబుళ్లకు పెట్రోకార్ విధులు అప్పగించాం. తొలిరోజు అద్భుతంగా విధులు నిర్వహించారు. కేజీబీవీ పాఠశాలల్లో విద్యార్థినుల భద్రతే లక్ష్యంగా ' పోలీస్ అక్క' పేరుతో మహిళా పోలీసులు హాస్టల్‌లో నెలలో ఒక రోజు బస చేసి వారి యోగక్షేమాలను తెలుసుకొని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

-ఎస్పీ జానకీ షర్మిల, నిర్మల్

### ఎస్పీ మేడంకు కృతజ్ఞతలు



మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా ఎస్పీ జానకి షర్మిల మేడం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం చాలా సంతోషకరం. ఇప్పటి వరకు మహిళా పోలీసులు అనగానే రిసెప్షన్ సేవలకే పరిమితమైన మాకు మెన్ పీసీలతో సమానంగా బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉంది.

- కీర్తన రెడ్డి, కానిస్టేబుల్, సోన్

### విద్యార్థినులకు భరోసాగా ఉంటాం



వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు అండగా ఉండేందుకు 'పోలీస్ అక్క' సేవల పేరుతో విద్యార్థినుల సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు జఠిలమైన సమస్యలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నెలలో ఒక రోజు వసతి గృహాలను సందర్శించి అక్కడే బస చేసి విద్యార్థినులకు పలు అంశాలపై అవగాహన కల్పిస్తాం.

- రజిత, కానిస్టేబుల్, నిర్మల్‌టౌన్